క్లుప్తంగా

భూభారతితోనే సమస్యలు పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్

రామగుండం: భూభారతితోనే భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో మంగళవారం నిర్వహించిన భూభారతి సదస్సులో ఆయన పలువురు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ పరిశీలకులు గుంట రమేశ్, రంజిత్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో విలీనంపై ఆందోళన..

లింగాపూర్ గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేయడంపై గ్రామ మహిళలు ఆందోళన నిర్వహించారు. భూభారతి సదస్సుకు హాజరయ్యేందుకు వస్తున్న తహసీల్దార్ రవీందర్‌పటేల్‌ను గ్రామ పొలిమేరలో మహిళలు అడ్డుకున్నారు. గ్రామ విలీనానికి, భూభారతి సదస్సుకు ఎలాంటి సంబంధం ఉండదని వివరించారు.

రావికంటి రామయ్య సేవలు ఆదర్శప్రాయం

మంథని: కవిగా, ఉపాధ్యాయుడిగా రావికంటి రామయ్య గుప్త సమాజానికి అందించిన సేవలు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. రామయ్య గుప్త జయంతి సందర్భంగా మంగళవారం మంథనిలోని ఆయన విగ్రహానికి మంథని విద్యార్థి యువత, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అనంతరం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం రామయ్యగుప్త తనయుడు రావికంటి శ్రీనివాస్‌ను సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీ, రమేశ్, ఉపాధ్యక్షుడు కొమురవెల్లి సమ్మయ్య, కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సుదర్శన్, గుండా శైలజ, రాజమౌళి గౌడ్, బోగోజు శ్రీనివాస్, బత్తుల సత్యనారాయణ, మారుతి, కృష్ణ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీంలు

జ్యోతినగర్: మహిళల భద్రత కోసం షీటీంలు పనిచేస్తున్నాయని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఆటో డ్రైవర్లకు, ఓనర్లకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. షీటీమ్ సభ్యులు మౌనిక, సురేశ్ పాల్గొన్నారు.

మేజిక్ రాజాకు సన్మానం

గోదావరిఖనిటౌన్: ప్రముఖ ఇంద్రజాలికుడు మేజిక్ రాజా ఇటీవల హైదరాబాద్ రవీంద్ర భారతిలో స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా నిరీక్షణ ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. స్థానిక గోదావరి కళా సంఘాల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు.

గౌడ సొసైటీకి భూమి కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న గౌడసంఘం సభ్యులు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామ గౌడ సొసైటీ గ్రామ శివారులోని సర్వే నంబర్ 271లో గల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంగళవారం తహసీల్దార్ వాసంతికి గౌడ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 271లో నాలుగు ఎరకాలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని, చుట్టుపక్కల ఉన్న రైతులు కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హద్దులు ఏర్పాటు చేసి గౌడ సొసైటీకి కేటాయిస్తే ఈతవనం పెంచుకుంటామని వినతిపత్రంలో పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కోల సత్యంగౌడ్, కోల నర్సగౌడ్, నరేందర్‌గౌడ్, కమ్మగోని మల్లయ్యగౌడ్, కోల మల్లయ్యగౌడ్, నర్సయ్యగౌడ్ ఉన్నారు.

ఖని ప్రధాన చౌరస్తాలో తాత్కాలిక బస్‌షెల్టర్



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కనుకుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం తాత్కాలిక బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సూర్యచంద్ర కన్‌స్ట్రక్షన్ కె.మొండయ్య, రవిచంద్ర దాతలుగా ఈ తాత్కాలిక బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నాయకులు గట్ల రమేశ్, ముస్తఫా, పాతిపెల్లి ఎల్లయ్య బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు.

ఇటు మురుగు.. అటు వరద

- ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి
- ప్రగతినగర్‌లో డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్న స్థానికులు
- విషజ్వరాలబారిన పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



ప్రగతినగర్‌లో ఇళ్ల మధ్య రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో ఎక్కడ చూసినా మురికి నీరు రోడ్లపై పారుతోంది. సైడ్ డ్రైనేజీలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థపు నీరు, వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ప్రగతినగర్‌లోని బుడిగజంగాలు నివాసముండే ప్రాంతంలో గత సంవత్సరం ఒక మహిళకు డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది. మరికొందరు జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాలనీలో తాత్కాలికంగా బ్లీచింగ్ పౌడర్ చల్లి చేతులు దులుపుకున్నారు. వర్షాకాలం కావడంతో మురుగు నీరు, వర్షపు నీరు చేరిన గుంతల్లో దోమలు, ఈగలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు వ్యాపించి మరికొందరు డెంగీ బారిన పడే ప్రమాదం ఉంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు నిలయాలు

కాలనీల్లోని ఖాళీ స్థలాలు దోమలకు నిలయాలుగా మారడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. నీరు నిలిచిన చోట కార్పొరేషన్ అధికారులు మొక్కుబడిగా ఆయిల్ బాల్స్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. కాలనీలో సైడ్ డ్రైనేజీలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలిచిన నీరు తరలించేందుకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీ నిర్మించాలి



కాలనీలో మురుగునీరు సాఫీగా పారేందుకు అధికారులు డ్రైనేజీలు నిర్మించాలి. కాలనీలో సైడ్ డ్రైనేజీలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వర్షం వచ్చిందంటే చాలు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. మా కాలనీ గ్రామ పంచాయతీకంటే అధ్వానంగా మారింది.

– కుమార్, ప్రగతినగర్

పట్టించుకోవడం లేదు



ప్రగతినగర్‌లో పారిశుధ్యం లోపించి ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. కాలనీలో ఎక్కడ చూసినా మురుగునీరు రోడ్లపై పారుతోంది. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవాలి. – కమలమ్మ, ప్రగతినగర్

ముందస్తు చర్యలు చేపడతాం



రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో పారిశుధ్య సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతాం. 100రోజుల ప్రణాళికలో భాగంగా డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నీరు నిలిచిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ (ఎఫ్ఏసీ)

హర్కర వేణుగోపాల్‌రావు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బాబర్ సలీంపాషా



చీరలు పంపిణీ చేస్తున్న పల్లికొండ శ్యాం

జ్యోతినగర్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రామగుండం ముద్దుబిడ్డ హర్కర వేణుగోపాల్‌రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితిలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. డీసీసీ కార్యదర్శి మహమ్మద్ రహీమ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్, గోసిక రవి, అర్కుటి రాజమల్లు, బొద్దున శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరల పంపిణీ

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా ఫిషరీస్ చైర్మన్ పల్లికొండ శ్యాం ఆధ్వర్యంలో అబాది రామగుండంలో నిరుపేద మహిళలకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు నోటుబుక్స్, స్టేషనరీ వస్తుసామగ్రి, మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టణంలోని తబితా ఆశ్రమంలో ఎండీ.వాజీద్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం చేశారు. అర్కుటి రాయమల్లు యాదవ్, నామాల కుమారస్వామి, ఆరుముళ్ల సదానందం, జావిద్ ఖాన్, సల్మాన్, రియాజ్, నాయబ్, అస్లాం, ఖలీమ్ గౌస్, జలీల్, నరేశ్, సాగర్, సతీశ్ ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన



ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 100రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం మురుగుదొడ్లు పరిశుభ్రం చేయడం, మురుగు కాలువల్లో పూడిక తొలగింపు పనుల తోపాటు డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరిఖని పోచమ్మగుడి సమీపంలోని ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను శుభ్రం చేసే కార్యక్రమంతోపాటు స్థానిక లక్ష్మీనగర్‌లో వ్యాపారులకు డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలు, 23వ డివిజన్‌లో మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించే పనులను బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. 100రోజుల కార్యక్రమం విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో శానిటరీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని బస్టాండ్ వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ దుర్గాదాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గాదాస్ మంగళవారం డ్యూటీ ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బస్టాండ్ వద్ద మరో బైక్ అతడిని ఢీకొనగా కాలు విరిగింది. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

• బైక్ చోరీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన బోయిని బాలకృష్ణకు చెందిన బైక్ సోమవారం మధ్యాహ్నం చోరీకి గురైంది. బాలకృష్ణ తన బైక్‌ను ఇంటి ఎదుట పెట్టి పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా బైక కనిపింకపోవడంతో చుట్టుపక్కలా వెతికిన దొరకలేదు. కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు సమీపంలోని ఓ సీసీ పుటేజీని మంగళవారం పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో మంథని వైపు వెళ్తున్నట్లు రికార్డు అయింది. బైక్ చోరీకి గురైందని కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అతను తెలిపాడు.

• సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీ: బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని శివాజీనగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) బ్రాంచ్ మేనేజర్ సతీశ్ సూచించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్‌బీఐ బ్యాంక్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కస్టమర్ రిలేషన్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఖాతాదారులు అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డ్, పిన్ నంబర్లను ఇతరులకు చెప్పొద్దన్నారు.

• గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి

ముత్తారం: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెలుకల కాంతయ్య(68) మంగళవారం గుండె పోటుతో మృతిచెందాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు కాంతయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

• స్కూల్ బస్సు సీజ్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎంవీఐ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సు నిబంధనలకు విరుద్ధంగా, సరైన పత్రాలు లేకుండా, అధిక సంఖ్యలో విద్యార్థులతో వెళ్తోంది. దీంతో ఎంవీఐ ఆ బస్సును ఆపి తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో సీజ్ చేశారు.

• సీసీరోడ్డు నిర్మాణంపై పర్యవేక్షణ కరువు

రామగిరి: మండలంలోని కల్వచర్లలో సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో అధికారుల పర్యవేక్షణ కరువైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కల్వచర్ల నుంచి లొంకకేసారం వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం వారు పరిశీలించారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్, పీఏసీఎస్ డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, సీనియర్ నాయకులు బొంకూరి పోచం, రేండ్ల కుమార్‌స్వామి, మేడగోని సదానందంగౌడ్, మోహన్, శంకర్, మంగ పాల్గొన్నారు.

• ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

సుల్తానాబాద్: ప్రైవేటు విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు నిలిపివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు తమనవేణి అభిరామ్, నాయకులు అనిల్, నరేశ్, ప్రదీప్, వేణు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తా



మంత్రితో మైనార్టీ నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలోని మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. పెద్దపల్లికి చెందిన మైనారిటీ నాయకులు మీర్జా అహ్మద్ బేగ్ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రిని కలిసి సన్మానించారు. మీర్జా జావిద్ బేగ్, మీర్జా సాజిద్ బేగ్, మీర్జా మొహిద్ బేగ్ ఉన్నారు.

ఆర్జీ-2 ఏరియా సందర్శన

గోదావరిఖని: జనరల్ మేనేజర్ ఎంపి(కార్పొరేట్) టి.శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ హెచ్ఆర్డీ(కార్పొరేట్) వెంకట రామిరెడ్డి మంగళవారం ఆర్జీ-2 ఏరియాను సందర్శించారు. ఆర్జీ-2 జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య, ఏరియా ముఖ్య అధికారులతో సమావేశమయ్యారు. ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, కేటాయించిన లక్ష్యాలు తదితర అంశాలను చర్చించారు. ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, అధికారులు ఉదయ్ హరిజన్, సంతోష్‌కుమార్, పి.అరవింద్‌రావు, మురళీకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

రామగుండం: బసంత్‌నగర్ సెక్షన్ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సదస్సును రామగుండం సబ్ డివిజన్‌లోని రామగుండం, అంతర్గాం, బసంత్‌నగర్, మేడిపల్లి, ఎన్టీపీసీ సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని అంతర్గాం మండల టీజీఎన్‌పీడీసీఎల్ ఏఈ ఆశ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ బిల్లులో హెచ్చుతగ్గులు, విద్యుత్ సరఫరాలో సమస్యలు, ఇతరత్రా ఏమైనా విద్యుత్ ఆధారిత సమస్యలను సదస్సుకు హాజరయ్యే అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు, కన్జుమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం, వరంగల్ రీజినల్ ఎన్‌వీ.వేణుగోపాలచారి, వివిధ సెక్షన్ల ఏఈలు హాజరుకానున్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రామ్మోహనచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడీనగర్ గ్రామంలోని జీఎం గార్డెన్స్‌లో ఉదయం 10:30గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సునీత పేర్కొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ కాలువలో పూడికతీత పనులు



పూడిక తీస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో రామగుండం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ ఆదేశాలతో మంగళవారం ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం పర్యవేక్షించారు. వర్షాకాలంలో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి వెలువడే వర్షపు నీరు ఈ కాలువ ద్వారానే పారుతాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో కాలువలో పేరుకుపోయిన చెట్లను తొలగించామని ఆయన తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న ఏరియా జీఎం వెంకటయ్య

గోదావరిఖని: ఆర్జీ-2 ఏరియాలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించి ఎన్టీపీసీ జైపూర్‌కు బదిలీపై వెళ్తున్న ఎం.నర్సింగరావు, డీజీఎం(పర్సనల్)గా విధులు నిర్వహించి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న ఎస్.అనిల్‌కుమార్‌ను ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య మంగళవారం సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, వకీల్‌పల్లి ఏజెంట్ ఎ.నెహ్రూ, అధికారులు ఉదయ్ హరిజన్, సంతోష్, పి.అరవింద్‌రావు, మురళీకృష్ణ, సుజన్ మెహ్రో, వెంకట రామచంద్ర, ఉజ్వల్ బంధోపాధ్యాయ, సుభాష్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో యోగా సాధన



యోగా చేస్తున్న సింగరేణి ఉద్యోగులు

గోదావరిఖని: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రామగుండం ఆర్జీ-2 ఏరియా జీఎం కార్యాలయం, గనులు, డిపార్ట్‌మెంట్లలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు పాల్గొని యోగా చేశారు.

డీజీఎం పర్సనల్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి రామగుండం ఆర్జీ-2 ఏరియాకు బదిలీపై వచ్చిన డీజీఎం పర్సనల్ అధికారి అరవింద్ రావ్‌ను ఆర్జీ-2 ఏరియా ఐఎన్టీయూసీ నాయకులు మంగళవారం కలిశారు. ఐఎన్టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ నాయకులతో కలిసి ఆయనను సన్మానించారు. సత్యనారాయణరెడ్డి, దశరథంగౌడ్, సంపత్‌రెడ్డి, సత్యనారాయణ, సోమయాజులు, రాజయ్య, మల్లికార్జున్, అవినాశ్, రవీందర్‌రెడ్డి, తిరుపతి, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కోరుకంటి



కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: విచారణ నిమిత్తం తెలంగాణ భవన్ నుంచి ఏసీబీ కార్యాలయానికి కేటీఆర్ వెళ్తున్న సందర్భంగా మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆయనను కలిశారు. ఆగస్టు 1న అమెరికా డల్లాస్ నగరంలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో రామగుండం నియోజకవర్గం ఎన్ఆర్ఐలు పాల్గొననున్నట్టు చందర్ తెలిపారు. హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఉన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన

ఎలిగేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండున్నర ఏళ్ల నుంచి మూడేళ్ల వయసులోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని అడిషనల్ సీడీపీవో సంపదకుమారి అన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధూళికట్ట అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు నేతకానిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ బాలమేళా కార్యక్రమం కేంద్రం-3లో నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహిచారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, రజిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోఎడ్యుకేషన్ ప్రారంభం

మంథని: మంథని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కోఎడ్యుకేషన్‌ను పాఠశాల హెచ్ఎం జె.సురేశ్ ప్రారంభించారు. స్థానిక తెనుగుగూడెం ప్రాథమిక పాఠశాల నుంచి బొగ్గుల మనోజ్ఞకు అడ్మిషన్ ఇచ్చి పాఠశాలలో పేరు నమోదు చేసుకున్నారు. పాఠశాలలో కోఎడ్యుకేషన్‌కు సహకరించిన తెనుగుగూడెం పాఠశాల హెచ్ఎం కిషోర్‌ను టీచర్లు, విద్యార్థులు సన్మానించారు.

స్వశక్తి మహిళలకు అవగాహన

పాలకుర్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన స్వశక్తి సంఘం మహిళలకు మంగళవారం బసంత్‌నగర్‌లోని మండల సమాఖ్య భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎల్ఈఏపీ ప్రతినిధి ఎండీ.ఖాసీం, డీపీఎం నాగేశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆచరణీయ పరిశ్రమలకు రిజిస్ట్రేషన్, బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీఎం సదానందం, కోఆర్డినేటర్ వంశీ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ డయేరియాకు ప్రథమ చికిత్స



సుల్తానాబాద్‌రూరల్: ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్

సుల్తానాబాద్‌రూరల్: వానాకాలంలో వచ్చే డయేరియాకు ఓఆర్ఎస్ ప్రథమ చికిత్సగా పని చేస్తుందని పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్‌కుమార్ అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సబ్ సెంటర్లలో మంగళవారం ఓఆర్ఎస్ కార్నర్ పాయింట్లు ఏర్పాటు చేశారు. నర్సు గ్రేసీమని, సూపర్‌వైజర్ రమాదేవి, స్టాఫ్‌నర్సు సాట్ల రవళి, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఫార్మాసిస్ట్ జగదీశ్ పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాం

ఎలిగేడు: విరేచనాలతో కలిగే మరణాలను తగ్గించడానికి డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు. జూన్16 నుంచి జూలై 31 వరకు ఇంటింటా సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఓఆర్ఎస్, జింక్ కార్నర్ డిపోలు ఏర్పాటు

ముత్తారం: మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ డిపోలను ఏర్పాటు చేసినట్లు మంగళవారం ముత్తారం ప్రభుత్వ వైద్యాధికారి అమరేందర్‌రావు తెలిపారు. పబ్లిక్ హెల్త్

అతిసార నివారణపై అవగాహన

రామగిరి: అతిసార వ్యాధి నివారణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. బేగంపేట పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన కల్పించారు. సీహెచ్‌వో భరత్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కొలనూర్ మల్లన్న ఆలయం దారి కబ్జాపై ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలోని అల్లిమాసాని చెరువు సమీపంలోని మల్లికార్జునస్వామి(మల్లన్నగుడి) ఆలయం దారిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తూ తహసీల్దార్ దీరజ్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మల్లన్నగుడికి భక్తులు వెళ్లే దారిని గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేశాడన్నారు. ఆలయం చుట్టూ ఉన్న భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌ను కోరారు.

ముగిసిన భూభారతి సదస్సులు

కమాన్‌పూర్: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయి. మంగళవారం రొంపికుంటలో నిర్వహించిన సదస్సుతో ముగిసినట్లు తహసీల్దార్ వాసంతి పేర్కొన్నారు.